ప్రభుత్వ బడిలో చదివారు.. లక్ష్యం సాధించారు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నత ఆశయం నెరవేరుతోంది. పేద బాల, బాలికల చదువు కోసం.. ప్రభుత్వ పాఠశాలలకు మెరుగులు దిద్దింది. అన్ని సౌకర్యాలు కల్పించి కార్పొరేట్ హంగులు సమకూర్చిది. ఆ విద్యాలయాలు నేడు ఫలితాల పరంగా సత్తా చాటాయి. పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు ఆధిపత్యం చూపి భళా అనిపించారు.

- మెరుగైన సౌకర్యాలు కల్పించిన గత ప్రభుత్వం
- అందిపుచ్చుకొన్న పదో తరగతి విద్యార్థులు
- కడప మండలంలో 1245 మంది ఉత్తీర్ణత
- 162 మందికి 500కు పైగా మార్కులు



వందశాతం ఉత్తీర్ణత సాధించిన నక్కాస్ ఉర్దూ కార్పొరేషన్ హైస్కూల్


యవశ్రీ(588) హరిణి(586) గాయత్రి(580)

కడప ఎడ్యుకేషన్: పది ఫలితాలు వెలువడ్డాయి. కడప మండలంలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల విద్యార్థులు ప్రతిభను చాటారు. మండల వ్యాప్తంగా 28 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 1874 మంది విద్యార్థులు ఈ ఏడాది పది పరీక్షలు రాశారు. 1249 మంది ఉత్తీర్ణత సాధించారు. వారిలో 831 మంది ఫస్ట్ క్లాస్‌లో ప్యాసయ్యారు. కడప మండలంలోని మూడు పాఠశాలు ఏడాది వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. నగరంలోని నక్కాస్ నగర పాలక ఉర్దూ ఉన్నత పాఠశాలలో 28 మంది పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఆంధ్ర ప్రదేశ్ ట్రైబర్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఫర్ గర్ల్స్‌లో 21 మంది రాశారు. వందశాతం ప్యాసయ్యారు. ప్రభుత్వ అంధుల పాఠశాలలో నలుగురు విద్యార్థులకు గానూ అందరూ ఉత్తీర్ణత సాధించారు. నగరంలోని చిన్న చౌక్ ఏపీ సోషియల్ వేల్ఫేర్ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్‌లో 68 మందికి గానూ 66 మంది, స్పోర్ట్స్ స్కూల్‌లో 41 మందికి గానూ 39 మంది ఉత్తీర్ణత సాధించారు. రామాంజనేయపురం ఏపీఆర్ఎస్‌లో 43 మందికి 38 మంది, ట్రైబర్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో ఆరుగురికి గానూ ఐదుగురు, నాగరాజుపేట మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో 64 మందికి గానై 59 మంది ఉత్తీర్ణత సాధించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ బాలికల హైస్కూల్‌లో 78 శాతం , ఎంసీఈహెచ్ఎస్ ఉర్దూ సాలేనాగయ్య స్ట్రీట్‌లో 76 శాతం, చెమ్మియాపేట జెడ్పీ స్కూల్‌లో 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. కడప జయనగర్ కాలనీ బాలికల హైస్కూల్, గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్‌లో 68 శాతం, మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో 67 శాతం, శాంతి నగర్ జ్పెడీ హైస్కూల్‌లో 67 శాతం, హైస్కూల్ ఉర్దూ బాయిస్‌లో 66 శాతం, గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో 61 శాతం, చౌడేశ్వరి ఓరియంటల్ స్కూల్‌లో 60 శాతం, కాగితాలపెంట జెడ్పీ హైస్కూల్‌లో 60 శాతం ఉత్తీర్ణత సాధించారు.

మండల టాపర్స్ వీరే...

కడప మండల పరిధిలోని చెమ్మియాపేట బాలికల హైస్కూల్‌కు చెందిన నీలం యువశ్రీ 588 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. ఇదే పాఠశాలకు చెందిన హరిణి 586 మార్కులతో ద్వితీయ, జయనగర్‌కాలనీ జెడ్పీ బాలికల హైస్కూల్‌కు చెందిన దేవి కీర్తన 581, గాంధీనగర్ హైస్కూల్‌కు చెందిన సహిత 581 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ గర్ల్స్ చిన్నచౌక్‌కు చెందిన విజయప్రభ 580, మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌కు చెందిన సుస్మారాయల్ 580 మార్కులతో నాలుగో స్థానంలో నిలిచారు.

ఫలితాలు సంతృప్తిగా ఉన్నాయి...



పదో తరగతి ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయి. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలను అనుసరించి ఎప్పటికప్పుడు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు సలహాలు సూచనలు ఇవ్వడంతోపాటు ప్రత్యేక తరగతులు, వారాంతపు పరీక్షల నిర్వహణతో మంచి ఉత్తీర్ణత సాధించాము. చాలా సంతోషంగా ఉంది.

– దిద్దకుంట గంగిరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి, కడప

ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేక దృష్టి



పదో తరగతి చదివే ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేక దృష్టి పెట్టాం. మార్కుల పరంగా వెనుక బడిన వారిని ప్రత్యేకంగా పర్యవేక్షించాం. పరీక్ష రాసిన వారంతా ఉత్తీర్ణత సాధించారు. మా స్కూల్‌కు చెందిన షేక్ రుబియాకి 533 మార్కులు వచ్చాయి. ఈ ఫలితాలుమాకు సంతృప్తినిచ్చాయి.

- సాకిరా బేగం ఖాద్రి, ప్రధానోపాధ్యాయురాలు, ఉర్దూ ఉన్నత పాఠశాల, నక్కాస్, కడప

క్లుప్తంగా

చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద చలువ పందిళ్లు ఏర్పాటుచేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డీవైఎఫ్ఐ నాయకులు విజయ్, శ్రీకాంత్, ఉదయ్ తెలిపారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ చలువ పందిళ్లు లేకపోవడంతో ప్రజలు ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఇబ్బందిపడుతున్నారన్నారు.

కార్మికులు మేడేను పండగలా జరుపుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: మే డేను కార్మికులంతా పండగలా జరుపుకోవాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి కోరారు. నగరంలోని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కార్మికులకు సకల హక్కులు కల్పించిన రోజు మే డే అన్నారు. ప్రస్తుత పాలకులు మునుపటిలా 12 నుంచి 16 గంటలపాటు వెట్టిచాకిరీ చేయించుకుని లక్షల రూపాయలు గడిస్తున్నారని ఆరోపించారు. కార్మికులంతా పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్ధిరామయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


రోగికి సూచనలిస్తున్న డాక్టర్ మహబూబ్‌అలీ

కడప ఎడ్యుకేషన్: మెడికేర్ హాస్పిటల్‌లో డాక్టర్ మహబూబ్‌ఆలీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మహబూబ్ అలీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా తొలి దశలోనే రోగాలు గుర్తించి సమర్థంగా చికిత్స చేయించుకోవచ్చనారు. అనంతరం ఐబ్రోస్కాన్, రక్త పరీక్షలు ఉచితంగా చేశారు.

అత్యవసర సమయంలో రక్తదానం

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని ఎంఎం .హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మహబూబ్ బీకి అత్యవసర చికిత్స నిమిత్తం బి.పాజిటివ్ రక్తం ఇచ్చి ఖూన్ క రిస్తా చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ తారిక్ అలీ మానవత్వం చాటారు. తాను ఇప్పటి వరకూ 49 సార్లు రక్తదానం చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్, షబ్బీర్, రాము, బెనర్జీ పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్: కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తలసేమియా రోగికి మను పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తున్న మహమ్మద్ సికిందర్ హుస్సేన్ మానవత్వం చాటుకున్నారు. మహమ్మద్ సికిందర్ హుస్సేన్ మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు.

మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

కడప ఎడ్యుకేషన్: కడప ఏడు రోడ్ల సర్కిల్‌లో జేసీఐ ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమీర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమావాస్య పూజలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్: కడప నగరంలోని బాసట స్వచ్ఛంద సేవా సంస్థ దత్తత గ్రామం కాలభైరవపురంలోని కాలభైరవ స్వామి ఆలయంలో అర్చకులు శ్రీధర్‌శర్మ ఆదివారం అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. కాలభైరవ స్వామికి అభిషేకం, కూష్మాండ దీప సేవారాధన, పూజలు జరిపారు. భక్తులందరూ స్వామికి అత్యంత ప్రీతికరమైన గుమ్మడికాయలపై దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు బాసట సంస్థ నిర్వాహకులు బీపీ కార్తీకరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

చిన్నారుల సందడి


శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్: ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా కడప శిల్పారామంలోని సాంస్కృతిక వేదికపై చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. స్థానిక స్మైల్ కిడ్స్ పాఠశాల విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించారు. వారి నృత్యాలకు సందర్శకుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాలను కృష్ణప్రసాద్, ఫీల్డ్ సూపర్ వైజర్ మధుసూదన్‌బాబు పర్యవేక్షించారు.

శిల్పారామం పరిశీలన


శిల్పారామాన్ని పరిశీలిస్తున్న మంజులారెడ్డి

కడప కల్చరల్: రాష్ట్ర శిల్పారామాల చైర్ పర్సన్ రెడ్డి మంజులారెడ్డి ఆదివారం కడప శిల్పారామాన్ని సందర్శించారు. తొలుత శిల్పారామం కార్యాలయానికి వెళ్లి రికార్డులను పరిశీలించారు. అనంతరం లండన్ బస్సులో ఆమె స్వయంగా ప్రయాణించారు. కడప నగర వాసులకు కొత్త అనుభూతి ఇచ్చే ఆటలు, వస్తువులు పరిచయం చేయాలని, అందుకు తాము సంపూర్ణంగా సహకరిస్తామని తెలిపారు. కొత్త గేమ్స్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. కల్యాణ మండపం, బడ్జెట్ హోటల్ స్థలాన్ని, టిక్కెట్ కౌంటర్, స్టాల్స్, బోటింగ్ పాండ్‌లను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యస్.కృష్ణ ప్రసాద్, మధుసూదన్ పాల్గొన్నారు

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

కడప కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కొండాయపల్లెలోని సంస్థ ప్రధాన కార్యాలయ ఆవరణంలో వేసవి శిక్షణా శిబిరం నిర్వహించనున్నామని డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్ తెలిపారు. సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు రోజూ శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు. పిల్లలు ఎండలో తిరగకుండా, ప్రమాదాలకు గురికాకుండా, జీవితానికి పనికి వచ్చే మంచి అలవాట్లను నేర్చుకునేందుకు ఈ శిబిరం ఉపయోగపడుతుందన్నారు. ప్రతి రోజూ పుస్తక పఠనం, కథలు వినడం, పుస్తక సమీక్ష అంశాలలో ఉచితంగా శిక్షణ ఇస్తారని తెలిపారు. క్యారమ్స్, చెస్ నేర్పించనున్నట్లు తెలిపారు.

శాంతి కోరే దేశంపై ఉగ్ర దాడులా?

కడప కల్చరల్ : ప్రపంచ శాంతి, ప్రేమను కోరే భారత దేశంలో ఉగ్రవాదులు దాడులు చేయడం దుర్మార్గమని న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షుడు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ అన్నారు. చర్చిలో విశ్వాసులతో కలిసి వారు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జమ్ము కశ్మీర్‌లోని పహల్గామ్ మృతులకు సానుభూతి తెలుపుతూ వారి కుటుంబాలకు దైవం ఆసరాగా ఉండాలని కోరారు. అన్ని మతాల వారు సోదర భావంతో జీవిస్తారని, అలాంటి వారి మధ్య శాంతి, ప్రేమ స్థానంలో ఉగ్రవాదం ప్రవేశించడం ఆందోళనకరమన్నారు. ఈ కార్యక్రమంలో పి.రవితేజ, రోజా, శాంతి రాజు, సాలమ్మ, సుంకమ్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.


చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్ మహేష్

అమాయకులపై ఉగ్రవాదుల దాడి హేయం

కడప కార్పొరేషన్: పహల్గామ్‌లో అమాయక పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయం అని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి ఎన్‌డి.అజయ్ ప్రసన్న, ఏపీ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మెన్ వై.రమేష్‌బాబులు అన్నారు. కడపలోని తమ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్ర నిఘా అధికారి అజిత్‌దోవల్ చెప్పినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని విమర్శించారు. ప్రజలు సంచరించే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయకపోవడంతో ఉగ్రవాదులు దారుణానికి ఒడిగట్టారని విమర్శించారు. పాకిస్తాన్ ఉగ్రవాదుల బూచీ చూపించి దేశంలోని ముస్లిం మైనార్టీ వర్గాలను అభద్రతా భావానికి గురి చేయవద్దన్నారు. ఇప్పటికైనా శాంతి చర్చలు జరిపి దేశం అస్థిరపడకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ఉగ్ర దాడిలో మృతులకు నివాళి

కడప కల్చరల్: పహల్గాం ఉగ్ర దాడిలో మరణించిన పౌరులు, వారి కుటుంబాలకు నగరానికి చెందిన పలువురు దేవాలయాల అర్చకులు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం శ్రీరామ బ్రాహ్మణ యువ సంఘం అధ్యక్షుడు గుండ్లపూడి సత్యనారాయణ శర్మ, ఇతర అర్చకులు మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దేవునికడపలోని తమ కార్యాలయంలో కొద్దిసేపు మౌనం వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ శర్మ మాట్లాడుతూ ఉగ్రదాడి పిరికిపంద చర్యగా భావిస్తున్నామని చెప్పారు. భారత పౌరుల సహనాన్ని చేతగానితనంగా తీసుకుని ఇలాంటి దాడులు చేయడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, గౌరీ శంకర్, రఘువీర్, హరీష్ కుమార్ పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఊటుకూరు రింగురోడ్డు సర్కిల్ వద్ద ఆదివారం 45వ డివిజన్ కార్పొరేటర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి అధ్వర్యంలో పహల్గామ్ మృతులకు సంఘీభావంగా క్యాండిల్ ర్యాలీలో భగతసింగ్‌నగర్ వాసులు ర్యాలీ నిర్వహించి వారికి నివాళి అర్పించారు.

వాహిద్‌పై హత్యాయత్నం కేసు నమోదుచేయాలి

కడప కార్పొరేషన్: టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి పీఏ వాహిద్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి త్యాగరాజు, ఐటీ విభాగం నగర అధ్యక్షుడు ఎస్.ఫయాజ్ డిమాండ్ చేశారు. మాజీ డిప్యూటీ సీఎం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి పీఏ వాహిద్‌కు ఇది వరకూ పెళ్లయిందని, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. వలంటీర్‌గా పని చేస్తున్న అయేషాకు ఉద్యోగం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి రెండో పెళ్లి చేసుకున్నాడన్నారు. అప్పటి నుంచి ఆమెను వేధిస్తూ.. నగ్న వీడియోలు తీసి బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై నిలదీసిన ఆయేషా సోదరుడు సయ్యద్ అహ్మద్‌ను నిన్న అర్థరాత్రి దాడి చేసి తీవ్రంగా కొట్టారన్నారు. ప్రాణ భయంతో వారు ఎమ్మెల్యే ఇంటి వద్దకు వెళ్లి ఆర్తనాదాలు చేశారని, ఎవరినైనా పంపి తమను రక్షించాలని వాట్సాప్‌లో వాయిస్ రికార్డు పంపినా ఎమ్మెల్యే నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసినపుడు పట్టించుకోకుండా ఆ తర్వాత కేసు పెట్టి చేతులు దులుపుకొన్నారన్నారు. ఇపుడు ఉద్యోగం నుంచి పీఏను తొలగించామని ఎమ్మెల్యే పత్రికా ప్రకటన విడుదల చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి అండతోనే మాసాపేట శివ, మరికొందరితో కలిసి వాహిద్ దాడికి పాల్పడ్డారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టించడంలో ముందుండే ఎమ్మెల్యే మాధవి... టీడీపీలో కలుపు మొక్కలను ముందు ఏరిపారేయాలన్నారు. అతనికి సహకరించిన వారందరిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, ఆర్‌టీఐ వింగ్ నగర అధ్యక్షుడు తాహిద్‌ఖాన్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

బసిరెడ్డి విలక్షణమైన నాయకుడు

కడప కల్చరల్: రాజకీయాల్లో నైతిక విలువలు పాటించిన పెంచికల బసిరెడ్డి విలక్షణమైన నాయకుడిగా గుర్తింపు పొందారని హైకోర్టు న్యాయవాది పి.రఘునాథరెడ్డి అన్నారు. దివంగత పెంచికల బసిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం కడప నగరంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ మూడుమార్లు పులివెందుల ఎమ్మెల్యేగా, జిల్లా తొలి జెడ్పీ చైర్మన్‌గా, రెండు మార్లు రాష్ట్ర మంత్రిగా పెంచికల బసిరెడ్డి తన ప్రతిభ చాటుకున్నారన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ గొప్ప నాయకుడైన బసిరెడ్డి విగ్రహం వద్ద ఆయన పేరుతో బసిరెడ్డి సర్కిల్ అని నామకరణం చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాగార్జున విద్యా సంస్థల అధినేత శివశంకర్‌రెడ్డి, రాచమల్లు సురేంద్రారెడ్డి, లేబాక మధుసూదన్‌రెడ్డి, బసిరెడ్డి న్యాయ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, అభిమానులు పాల్గొన్నారు.


బసిరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

రేపు బ్రౌన్ అదనపు భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన

కడప కల్చరల్: సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో అదనపు భవనాలకు మంగళవారం శంకుస్థాపన నిర్వహించనున్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎస్.సవిత కార్యక్రమానికి హాజరై శంకుస్థాపన చేయనున్నట్లు ఆమె తెలిపారు.

మన్ కీ బాత్ వీక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: దేశ ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్ ఎపిసోడ్‌ను టీవీ ద్వారా కడపకు చెందిన బీజేపీ నేతలు వీక్షించారు. సీకే.దిన్నె మండలం గుర్రంగుంపు తండా గ్రామంలో స్థానిక ప్రజలతో కలిసి ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కందుల మురళి మోహన్‌రెడ్డి, బొమ్మన విజయ్, బత్తల పవన్ కుమార్, శివ నాయక్, కిరణ్, ప్రవీణ్ నాయుడు, ఓబుళయ్య, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో వృద్ధులకు చేయూతనిస్తాం

కడప కోటిరెడ్డిసర్కిల్: చింతకొమ్మదిన్నె మండలం ఆజాద్ నగర్‌లోని బృంద వృద్ధాశ్రమంలో బంధం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. పౌండేషన్ అధ్యక్షుడు భాస్కర్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ దివ్య మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ఇలాంటి సేవ చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావించాలన్నారు. వృద్ధులు దైవంతో సమానమని, భవిష్యత్తులో వృద్ధులకు తమవంతు చేయూతనిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాలసుబ్బయ్య, సుధారాణి, విజయభాస్కర్, భవాని శంకర్, హరికృష్ణ, నందకిషోర్. హర్షవర్ధన్, మోహన్, బాబుల్ రెడ్డి, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.


వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న దాతలు

బోటనీ విద్యార్థులు నైపుణ్యం మెరుగుపరచుకోవాలి

కడప ఎడ్యుకేషన్: బోటనీ విద్యార్థులు తమ నైపుణ్యం మెరుగుపరచుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ వేమల సలీంబాషా అన్నారు. స్థానిక ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళ కళాశాలలో ఆదివారం బోటనీ విద్యార్థినులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నూతన విద్యా విధానం(ఎన్‌ఈపి) ప్రకారం ప్రతి విద్యార్థిని రెండు నెలలపాటు ఇంటెన్షిప్ పూర్తిచేసుకోవాలని తెలిపారు. డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి విద్యార్థినికీ ఇంటెన్షిప్ అనంతరం లాక్ బుక్, సర్టిఫికెట్ డిపార్ట్‌మెంట్‌లో అందజేయాలని తెలిపారు. అనురాధ, విద్యార్థులు పాల్గొన్నారు


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సలీంబాషా

29న శివపార్వతుల కల్యాణోత్సవం

వల్లూరు : పుష్పగిరి క్షేత్ర ఆలయాల సముదాయంలోని చింతలపత్తూరు ఇంద్రనాథేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలను సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చెంచు సుబ్రమణ్యం స్వామి తెలిపారు. 28న గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవాచనము, మంటపారాధన, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, మహానైవేద్యం, మహా మంగళహారతి, మంత్రపుష్పం జరుగుతాయని తెలిపారు. సాయంత్రం అంకురార్పణ, అగ్నిప్రతిష్ట, దీక్షాహోమం, గణపతి, లక్ష్మీనారాయణ తదితర హోమాలు జరుగుతాయి. 29న ప్రాతఃకాలపూజ, దీక్షాహోమం, మహన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం జరుగుతుంది. అనంతరం శివపార్వతుల కల్యాణ జరుగుతుంది. అనంతరం మహానైవేద్యం, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుంది. సాయంత్రం శివ సహస్రనామార్చన, పుష్పయాగం, పుష్పాలంకార సేవ, మహా మంగళహారతి, మంత్రపుష్పం జరుగుతుంది. 30న ప్రాతఃకాలపూజ, మహన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేచనం, విభూత్యలంకార సేవ, నవగ్రహ, శివపంచాయతన మూలమంత్ర, శ్రీరుద్ర హోమాలు, మహా పూర్ణాహుతి, మహానైవేద్యం, మహా మంగళహారతి, మంత్రపుష్పం, కలశోద్వాసనము, మహదాశీర్వచనం, తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుందని తెలిపారు.


ఇంద్రనాథేశ్వరస్వామి ఆలయం

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. భక్తులు మొక్కుబడులను చెల్లించుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే ఆలయ సమీపంలోని వీరభద్రస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తులు పూజలు చేశారు.


విశేష అలంకారంలో గంగమ్మతల్లి

మెగా డీఎస్సీ ముందు టెట్ నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీకు ముందు టెట్ నిర్వహించి నిరుద్యోగ అభ్యర్థులను ఆదుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం .అంకన్న విజ్ఞప్తి చేశారు. కడప నగరంలోని పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల డీఎస్సీ విడుదల అవడంతో నిరుద్యోగులు సంతోషం వ్యక్తం చేశారన్నారు. ఈ విద్యాసంవత్సరం బిఈడీ, డిఈడీ పరీక్షలు ఉత్తీర్ణులైన విద్యార్థులు లక్షలాది మంది ఉన్నారని తెలిపారు. పాఠశాల విద్యా శాఖ నిబంధనల ప్రకారం ఏటా రెండుసార్లు టెట్ నిర్వహించాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి డీఎస్సీ దరఖాస్తు గడువు పొడిగించి మళ్లీ టెట్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు జిల్లా నాయకుడు మహేష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అంకన్న

మట్టికుండ.. ఆరోగ్యం చల్లంగుండ


అమ్మకానికి తీసుకువచ్చిన కుండలు

ఒకప్పుడు పేదవాడి రిఫ్రిజిరేటర్‌గా పేరొందిన మట్టికుండ...ఇటీవలి కాలంలో ప్రతి ఒక్కరికీ అవసరమైన వస్తువుగా మారిపోయింది. మారుతున్న జీవన శైలి దృష్ట్యా మట్టి కుండలో నీటిని తాగితే ఆరోగ్యపరంగా మంచిదని వైద్యులు సూచిస్తుండటంతో ప్రతి ఒక్కరూ వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇళ్లలో డబుల్ డోర్ ఫ్రిజ్‌లు ఉన్నప్పటికీ మట్టి కుండలు కొనుక్కొనిపోతున్నారు. ప్రజల అభిరుచికి తగినట్లుగా కుండలు తయారు చేసేవారు కూడా కూజాలు, జగ్గులు, వాటర్ బాటిళ్లు, వంటపాత్రలు వంటి వివిధ ఆకృతుల్లో వాటిని తయారు చేసి అందుబాటులో ఉంచుతున్నారు.

– రమేష్ తీట్ల, సాక్షి ఫొటోగ్రాఫర్


జగ్ ఆకారంలో కుండలు


వాటర్ బాటిల్ ఆకారంలో..

రైల్వే స్టేషన్‌లో మొరాయించిన లిఫ్ట్

కడప కోటిరెడ్డి సర్కిల్: కడప రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన లిఫ్ట్ మొరాయించింది. ఆదివారం లిఫ్ట్ పనిచేయకపోవడంతో ఒకటో ప్లాట్‌ఫామ్ నుంచి మూడో ప్లాట్‌ఫామ్ మీదకు వెళ్లేందుకు చంటిబిడ్డ తల్లులు, వృద్ధులు చాలా ఇబ్బందిపడ్డారు. ఈ రోజు ఉదయం నుంచి లిఫ్ట పనిచేయడంలేదని పలువురు ప్రయాణికులు తెలిపారు. లిఫ్ట్ ఏర్పాటు చేసి చాలా రోజులు కావడంతో ఇటీవల అంది తరచూ మొరాయిస్తోంది. అయితే రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. మూడో ప్లాట్ ఫామ్ మీదకు వెళ్లాలంటే లిఫ్ట్ ద్వారా వెళ్లాల్సి ఉందని, లేకపోతే మెట్ల పైనుంచి వెళ్లాలనని ప్రయాణికులు చెబుతున్నారు. లిఫ్ట్ పని చేసే విధంగా చూడాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.


వేచియున్న జనం


కడప రైల్వే స్టేషన్‌లో పనిచేయని లిఫ్ట్